
సాక్షి
ఒడిశా

గురువారం । 20 । జూలై । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలక వర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,48,622లు, బంగారం 100 మిల్లీగ్రాములు, వెండి 22.95 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



గంజాం జిల్లాకు భూ సంస్కరణ పురస్కారం - 8లో



రోడ్డు ప్రమాదంలో యువకుల మృతి - 8లో

న్యూస్‌రీల్

సాహిత్య అకాడమీ కార్యదర్శి ప్రబోధ్ ఆకస్మిక మృతి



ప్రబోధ్ రాత్

భువనేశ్వర్: ప్రముఖ రచయిత, ఒడిశా సాహిత్య అకాడమీ కార్యదర్శి, సమర్థుడైన నిర్వాహకుడు ప్రబోధ్ రాత్ మంగళవారం రాత్రి కటక్ వైద్య కేంద్రంలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆదివారం రాత్రి కటక్ నగరంలో ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వీధి కుక్క అడ్డు తగలడంతో ప్రమాదానికి గురయ్యారు. కలెక్టర్ నివాసానికి అతి సమీపంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. తీవ్ర గాయాలతో పాటు మెదడు భాగం దెబ్బ తినడంతో ఇంటెన్సివ్ కేర్ యూనిట్(ఐసీయూ)లో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందారు. ప్రబోధ్ రాత్ అకాల మరణం పట్ల ఒడిశా సాహిత్య అకాడమీ సభ్యులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. సమర్థవంతమైన అధికారిగా మన్ననలు పొందిన రాత్.. ఉత్తమ రచయితగా సుపరిచితులు. ఆయన మృతి పట్ల కటక్ కలెక్టర్ భవానీశంకర్ చొయినీ ప్రగాఢ సంతాపం వ్యక్తంచేశారు.

గంజాయితో మహిళల అరెస్ట్



పోలీసుల అదుపులో నిందిత మహిళలు

రాయగడ: గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరు మహిళలను మునిగుడ పోలీసులు అరెస్ట్ చేశారు. మునిగుడ రైల్వేస్టేషన్ వద్ద ఆటో స్టాండ్‌లో చేపట్టిన తనిఖీల్లో వీరు పట్టుబడ్డారు. నిందితులు మధ్యప్రదేశ్ లోని సాగర్ జిల్లా మంతెన గ్రామానికి చెందిన సంగీత(28), భోపాల్‌కు చెందిన రాను టక్కర్(23)గా గుర్తించారు. వీరి నుంచి 10.8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు. నిందితులను బిసంకటక్ కోర్టులో హాజరు పరిచామని మునిగుడ ఐఐసీ సౌధామిని బెహరా తెలిపారు.

గుడారిలో పింఛన్ల పంపిణీ



లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తున్న గమాంగొ

రాయగడ: జిల్లాలోని గుడారి సమితి కార్యాలయ ప్రాంగణంలో కొత్తగా నమోదైన 75మంది లబ్ధిదారులకు మధుబాబు పింఛన్లను గుణుపూర్ ఎమ్మెల్యే రఘునాథ్ గమాంగొ బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోందన్నారు. వారి ఆర్థిక, సామాజిక రంగాల అభివృద్ధితో పాటు ఎల్లప్పుడూ అండగా నిలిచేలా పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సమితి వైస్ చైర్మన్ విశ్వనాథ్ సాబోరొ, జిల్లా పరిషత్ సభ్యురాలు ప్రతి ప్రాష్క తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక సమస్యలను తెలుసుకొని, పరిష్కరించేందుకు హామీ ఇచ్చారు.

భద్రక్-బాలాసోర్ మెమూ రైలు ఘటన

- నీలగిరి రోడ్ స్టేషన్ మేనేజర్, పాయింట్ మన్‌పై వేటు

భువనేశ్వర్: భద్రక్-బాలాసోర్ మెమూ రైలు లోకో పైలెట్ సమయ స్ఫూర్తి, అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పింది. బాలాసోర్ జిల్లా నీలగిరి రోడ్ రైల్వేస్టేషన్ సమీపంలో త్రుటిలో ఘోర ప్రమాదం తప్పడంతో ప్రయాణికులు బతికి బయటపడ్డారు. ఈ ఘటన మంగళవారం మధ్యాహ్నం చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇద్దరు సిబ్బందిని విధుల నుంచి తొలగించినట్లు ఆగ్నేయ రైల్వే ఖరగ్‌పూర్ డివిజన్ అధికారులు తెలిపారు. వీరిలో స్టేషన్ మేనేజర్, పాయింట్ మన్ ఉన్నారు. నీలగిరి రోడ్ స్టేషన్ మేనేజర్ సుభాస్ సెఠి, పాయింట్ మన్ షేక్ మహ్మద్ ఖలీఫ్ విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు గుర్తించి, ఉత్తర్వులు జారీ చేశారు. బహనాగా బజార్ స్టేషన్‌లో ఘోర రైలు ప్రమాదం చోటు చేసుకొని, 293మంది ప్రాణాలను బలిగొన్న తరహాలో 15 కిలోమీటర్ల సమీపంలోని భద్రక్-బాలాసోర్ మెమూ రైలు ప్రమాదానికి గురి కావాల్సిన విపత్తు అదృష్టవశాతు తొలగిపోయింది. ఈ రైలు పొరపాటున డౌన్ లూప్ లైన్ లోకి ప్రవేశించినట్లు గమనించి లోకోపైలెట్ సమయ స్ఫూర్తితో బ్రేకులు వేయడంతో ఈ ప్రమాదం తప్పింది. విపత్కర పరిస్థితిని పసిగట్టి, రైలుని సురక్షితంగా వెనుకకు మళ్లించి సక్రమ మార్గంలో నడిపించేందుకు చేసిన ప్రయత్నం ఫలప్రదం కావడంతో వందలాది మంది ప్రాణాలు దక్కాయి.

జల దిగ్బంధం

- మల్కన్‌గిరి జిల్లాలో ఎడతెరిపి లేని వర్షాలు
- ఉధృతంగా ప్రవహిస్తున్న శబరీ, సప్తధార నదులు
- వంతెనల పైకి నీరు చేరడంతో నిలిచిన రాకపోకలు



శబరీ నదిపై పొట్టేరు-మోటు వంతెనపై రాకపోకలు నిషేధించి, పహారా కాస్తున్న అధికారులు

మల్కన్‌గిరి: జిల్లాలో గత 3రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీని ప్రభావంతో జిల్లా కేంద్రం జల దిగ్బంధంలో చిక్కుకుంది. మల్కన్‌గిరి వెళ్లే ప్రధాన మార్గాలన్నీ నీటితో నిండిపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. సప్తధార నది ఉప్పొంగడంతో జిల్లాలోని పంగం వద్ద ఉన్న వంతెనపై 5అడుగుల మేర వరద నీరు ప్రవహిస్తోంది. మల్కన్‌గిరి-జయపురం మధ్య ఇదే ప్రధాన రహదారి కావడంతో ఇరువైపులా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే శబరీ నది ఉధృతంగా మారడంతో కలిమెల సమితి పొట్టేరు వద్ద వన్న వంతెనపై 6అడుగుల మేర నీరు చేరింది. మోటు వద్ద వంతెన కూడా నీటితో నిండిపోవడంతో ఎంవీ-96, ఎంవీ-90 గ్రామాలు పూర్తిగా నీటి మధ్యే చిక్కుకున్నాయి. మల్కన్‌గిరి సమితిలో 183.2 మిల్లీమీటర్లు, మత్తిలిలో 79, ఖొయిర్‌పుట్‌లో 88, చిత్రకొండలో 199, కోరుకొండలో 185, కలిమెల 114, పొడియాలో 95 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని మల్కన్‌గిరి వాతవారణం కేంద్రం అధికారులు తెలిపారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని పాత్రొగూడ, నేతాజీ నగర్, బుటిగూడ, మాల్యవంత్ నగర్ తదితర ప్రాంతాలు వరద నీటితో నిండిపోవడంతో ప్రజలను జిల్లా యంత్రాగం పునరావాస కేంద్రాలకు తరలించారు. పూరి గుడిసెల్లో నివసించే పలువురికి టార్పాన్లు, నిత్యావసర సరుకులు అందజేశారు. మరోవైపు అధికారులంతా ప్రజలకు 24గంటలు అందుబాటులో ఉండాలని కలెక్టర్ విశాల్‌సింగ్ ఆదేశించారు. ఎక్కడిక్కకడ ఓడ్రాఫ్, అగ్నిమాపక బృందాలను మొహరించారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న సప్తధార నది

నేలకొరిగిన చెట్లు..

జయపురం: మరోవైపు బొయిపరిగుడ సమితిలోని పలు ప్రాంతాల్లో రోడ్లపై చెట్లు నొలకొరగడంతో రాకకపోకలకు అంతరాయం కలిగింది. జయపురంలో 15 మిల్లీమీటర్లు, బొయిపరిగుడ సమితిలో 79, కొట్‌పాడ్‌లో 52, కుంద్రాలో 50.6, బొరిగుమ్మలో 25మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. జయపురం పట్టణంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.



జయపురం: బొయిపరిగుడ సమితిలో రోడ్డుపై పడిన చెట్టును తొలగిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



పర్లాకిమిడి: తాత్కాలిక వంతెన కొట్టుకుపోయిన ప్రాంతం

కొట్టుకుపోయిన వంతెన

పర్లాకిమిడి: ఎడతెరిపి లేని వర్షాలకు గజపతి జిల్లా గుసాని సమితి కెరండీ పంచాయతీ కెరండీ-దాలింబాపూర్ రోడ్డులో మహేంద్రతనయ నదిపై నిర్మాణంలో ఉన్న తాత్కాలిక వంతెన వరద నీటికి కొట్టుకు పోయింది. దీంతో ఆంధ్రా-ఒడిశాతో సరిహద్దలోని అమర, రట్టిని(శ్రీకాకుళం జిల్లా), దాలింబాపూర్ తదితర 15 గ్రామాలకు సంబంధాలు తెగిపోయాయి. రూ.79.25 లక్షల వ్యయంతో బిజూ సేతుయోజన పథకం కింద రూరల్ రోడ్లు శాఖ దీని నిర్మాణం ప్రారంభించింది. మహేంద్రతనయ కాలువపై తాత్కాలికంగా నిర్మించిన వంతెన వరద ఉధృతికి కొట్టుకు పోయింది. దీంతో దాలింబాపూర్, అమర, రట్టిని గ్రామప్రజలు వసుంధర గ్రామం మీదుగా చుట్టు తిరిగి పర్లాకిమిడి వెళ్లాల్సి వస్తోంది. అధికారులు స్పందించి, ప్రత్యమ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.



రాకపోకలు నిలిచిపోవడంతో పంగం వద్దే ఉండిపోయిన ప్రయాణికులు



నీట మునిగిన పంటపొలాలు

నెక్కంటికి ఘనస్వాగతం

- బీజేడీ ఉపాధ్యక్షుడిగా నియమించిన పార్టీ అధిష్టానం



నెక్కంటికి స్వాగతం పలుకున్న బీజేడీ శ్రేణులు

రాయగడ: బీజేడీ రాష్ట్రశాఖ ఉపాధ్యక్షుడిగా నియమితులైన రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావుకు పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. ఉపాధ్యక్షుడిగా నియమితులైన అనంతరం భువనేశ్వర్ వెళ్లి, బిజూ జనతాదళ్ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి సీఎం నవీన్ పట్నాయక్‌ను కలిసిన ఆయన.. అతని ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం రాయగడకు చేరుకున్న నెక్కంటికి స్థానిక రిలయన్స్ పెట్రోల్ వద్ద పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై స్వాగతం పలికారు. అక్కడి నుంచి అశోకా టాకీస్, మెయిన్ రోడ్డు మీదుగా ఆయన నివాసం వరకు ర్యాలీ నిర్వహించారు. అడుగడుగునా మహిళలు హారతులిచ్చి, నీరాజనాలు పలికారు. అంతకుముందు గుణుపూర్ సబ్ డివిజన్ ముచికిపాదోరొ వద్ద బీజేడీ సీనియర్ నాయకులు, గుణుపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ శివప్రసాద్ గాడొ నేతృత్వంలో పార్టీ కార్యకర్తలు నెక్కంటికి ఘన స్వాగతం పలికారు. అనంతరం కొలనార, జేకే పూర్‌లో పార్టీ కార్యకర్తలు నెక్కంటికి పూలమాలలు వేసి, స్వాగతం పలికారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో నెక్కంటి ఆధ్వర్యంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని కార్యకర్తలు ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాయగడ మున్సిపాలిటీ చైర్మన్ మహేష్ పట్నాయక్, సమితి అధ్యక్షురాలు టున్ని హుయిక, రాయిసింగి బిడిక, కాశీపూర్ నాయకుడు జగదీష్ పాత్రొ, జిల్లా పరిషత్ సభ్యురాలు సంధ్యా పులక తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

రుణపడి ఉంటా..

తన రాజకీయ జీవితంలో బీజేడీ, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఎప్పుడూ రుణపడి ఉంటానని నెక్కంటి భాస్కరరావు అన్నారు. పార్టీ అభివృద్ధికి చేస్తున్న సేవలను గుర్తించిన అధిష్టానం ఈ బాధ్యతను అప్పగించిందని, సాయశక్తులా బీజేడీ ఉన్నతికి కృషి చేస్తానని ప్రకటించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాని రాయగడ, బిసంకటక్, గుణుపూర్ శాసనసభ నియోజకవర్గాలతో పాటు కొరాపుట్ లోక్‌సభ స్థానాన్ని కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

బీసీ ఈడీసీఎస్ అధ్యక్షుడిగా రామకృష్ణ బిసోయి



అధ్యక్షుడు రామకృష్ణను అభినందిస్తున్న ఈశ్వర్ పాణిగ్రాహి, మున్నా రథొ

కొరాపుట్: రాష్ట్ర వెనుకబడిన వర్గాల ఆర్థికాభివృద్ధి సహకార సంస్థ అధ్యక్షుడిగా కొరాపుట్ జిల్లాకు చెందిన రామకృష్ణ బిసోయి నియమితులయ్యారు. భువనేశ్వర్‌లోని కార్పొరేషన్ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం జరిగిన ఎన్నికలో మొత్తం 21మంది డైరెక్టర్లు ఆయనను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ పదవిలో రామకృష్ణ 5 ఏళ్లుగా కొనసాగనున్నారు. ఆయన స్వస్థలం జిల్లాలోని కొట్‌పాడ్ ప్రాంతం. ఈ సందర్భంగా ఎన్నికల పర్యవేక్షుడిగా వ్యవహరించిన కొరాపుట్ సెంట్రల్ కో-ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర్‌చంద్ర పాణిగ్రాహి, ఉప పర్యవేక్షుడిగా వ్యవహరించిన జయపురం మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మున్నా రథొ తదితరులు హాజరై, రామకృష్ణను అభినందించారు.

అమానుషం!


- గోనె సంచిలో పసికందును వదిలిన తల్లిదండ్రులు



గోనె సంచిలో స్థానికులు గుర్తించిన పసికందు

భువనేశ్వర్: రాష్ట్ర రాజధాని నగరంలో బుధవారం అమానుష ఘటన ఎదురైంది. నందన్ కానన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న కల్వర్టు కింద గోనె సంచిలో ముక్కు పచ్చలారని ఓ పసికందుని స్థానికులు కనుగొన్నారు. చొరవ కల్పించుకుని బిడ్డను అక్కున చేర్చుకుని, సత్వర చికిత్స కోసం క్యాపిటల్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. అనంతరం బిడ్డని శరణాలయానికి తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. రఘునాథ్‌పూర్ గ్రామస్తులు కల్వర్టు కింద గోనె మూటలో శిశువు ఉన్నట్లు గుర్తించి వెలుగులోకి తీసుకుని వచ్చారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. బిడ్డ తల్లిదండ్రులను గుర్తించేందుకు గాలిస్తున్నారు.

పాడాపాదర్‌లో బీఎస్‌ఎఫ్ వైద్య శిబిరం



శిబిరంలో పేర్లు నమోదు చేసుకుంటున్న గిరిజనులు

జయపురం: బొయిపరిగుడ సమితి దండాబడి పంచాయతీ పాడాపాదర్ గ్రామంలోని అంగన్ వాడీ కేంద్రంలో బీఎస్‌ఎఫ్-180 బెటాలియన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కమాండర్ సత్యేంద్ర తొప్పి పర్యవేక్షణలో 215మంది గ్రామస్తులకు వైద్య పరీక్షలు అందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. శిబిరంలో డిప్యూటీ కమాండెంట్ సింగ్, కంపెనీ కమాండర్ ఇన్‌స్పెక్టర్ కుమార్ ధీరాజ్, పంచాయతీ సర్పంచ్ చెండియ ఖీలొ, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

మరో 35 పాఠశాలల్లో 5టీ అభివృద్ధి



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్

పర్లాకిమిడి: గజపతి జిల్లాలోని 5సమితుల పరిధిలో ఉన్న 35 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 5టీ కార్యచరణలో భాగంగా అభివృద్ధి చేయనున్నట్లు కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్ వెల్లడించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో విద్యాశాఖపై బుధవారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. 5టీ నాలుగో విడతలో భాగంగా మోహానా సమితిలో 8ఉన్నత పాఠశాలలు, నువాగడ సమితిలో 2, రాయఘడలో 7, గుసాని సమితిలో 9, గుమ్మా బ్లాక్‌లో 6, కాశీనగర్ సమితిలో 3 ఉన్నత విద్యాలయాలను స్మార్ట్ తరగతులుగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. ఈ పనులను 2023 డిసెంబర్ లోగా పూర్తి చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ సందర్భంగా జిల్లా ముఖ్య విద్యాధికారి ప్రదోష్‌కుమార్ నాయక్ తోపాటు ప్రధానోపాధ్యాయులు, విద్యాలయాల కమిటీ అధ్యక్షులు, విద్యార్థులతో కలెక్టర్ ఇష్టాగోష్ఠిగా చర్చించారు. ప్రభుత్వ విద్యాలయాల రూపురేఖలు మార్పుతో విద్యార్థుల ఆలోచనా విధానం, భవిష్యత్ లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు.

ఊపందుకున్న ఉభాలు..



జయపురం: చురుగ్గా సాగుతున్న వ్యవసాయ పనులు

పర్లాకిమిడి: గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జిల్లాలోని కాశీనగర్, గుసాని సమితిలోని రామసాగరం దిగువ పంటపొలాలు, కెరండీ, అమర, రట్టిని, కోర్సండ గ్రామాల్లో ఉభాలు ఊపందుకున్నాయి. దీంతో రైతులు పొలం పనుల్లో నమగ్నమయ్యారు. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో దాదాపు 14,198 ఎకరాల్లో వరి సాగు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో పాతకెరండి గ్రామంలోని వ్యవసాయదారులకు రామలింగేశ్వర సొసైటీ ద్వారా సబ్సిడీలో డీఏపీ, యూరియా, పొటాష్ ఎరువులను ప్రభుత్వం నుంచి సబ్సిడీపై సరఫరా చేస్తున్నట్లు ప్రకటించారు. ధాన్యం అమ్మకాలకు రైతులు తమ పేర్లను సహకార సంఘాల కార్యాలయాల్లో రిజిస్టర్ చేసుకునేందుకు ఆగస్టు 18వరకు గడువు పొడిగించినట్లు వెల్లడించారు.

ఆనందంలో రైతులు..

జయపురం: సబ్ డివిజన్‌లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రైతుల్లో ఆనందం వెల్లువిరుస్తోంది. దీంతో ఇప్పటి వరకు వర్షాభావం పరిస్థితులతో ముందుకు సాగని ఖరీఫ్ పనులు.. ఒక్కసారిగా ఊపందుకున్నాయి.



రామసాగరం వద్ద వరి నాట్లు వేస్తున్న మహిళలు

క్లుప్తంగా

మురుగులో కాలువలో మరో కార్మికుడు మృతి

• శుభ్రం చేస్తూ జారిపడిన పారిశుద్ధ్య కార్మికుడు



నర్సింహారావు మృతికి కారణమైన మురుగు కాలువ

భువనేశ్వర్: కటక్ నగరంలోని బారొపాదోరొ వద్ద మురుగు కాలువలో పడి మరో వ్యక్తి మరణించాడు. మృతుడు జైకా ప్రాజెక్టులో పారిశుద్ధ్య కార్మికుడిగా పని చేస్తున్న నర్సింహారావుగా గుర్తించారు. 4రోజుల క్రితం ఇదే తరహాలో జోలాసాహి వద్ద యువకుడు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. బారొపాథొరొ ప్రాంతంలోని ఈ కాలువను బుధవారం ఉదయం శుభ్రం చేసే పనిలో నిమగ్నమైన తరుణంలో ప్రమాదవశాతు కాలు జారడంతో ఈ విచారకర ఘటన చోటు చేసుకుంది. స్థానికులు రక్షించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. సమాచారం అందడంతో అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని, అతనిని బయటకు తీశారు. సత్వర చికిత్స కోసం స్థానిక ఎస్‌సీబీ మెడికల్ కళాశాల ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించారు. కటక్ మున్సిపల్ కార్పొరేషన్(సీఎంసీ) గృహ నిర్మాణ, నగర అభివృద్ధి విభాగం నిర్లక్ష్యంతో నగరంలో తరచూ ఇటువంటి విషాద ఘటనలు పునరావృతం అవుతున్నాయని సర్వత్రా విచారం వ్యక్తం అవుతోందిది. మరోవైపు ఈ ఏడాది మేలో పూరీఘాట్ పోలీసు ఠాణా పరిధిలోని కేసర్‌పూర్‌లోని గమాడియా ప్రాంతంలో ఉన్న దశాబ్దాల నాటి ఇనుప వంతెన కూలిపోవడంతో తీవ్ర గాయాలకు గురైన 13ఏళ్ల బాలిక.. అప్పటి నుంచి ఎస్‌సీబీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మరణించింది.

కఠినంగా లింగనిర్ధారణ నిషేధ చట్టం అమలు

• ఆంధ్ర, ఒడిశా సరిహద్దు జిల్లాల వైద్యాధికారుల తీర్మానం

అరసవల్లి: లింగ నిర్ధారణ నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాల వైద్యాధికారులు నిర్ణయించారు. ఈ మేరకు సంయుక్తంగా తీర్మానం చేశారు. పర్లాకిమిడిలోని సీడీఎంవో కార్యాలయంలో బుధవారం జరిగిన ప్రత్యేక సమావేశంలో ఈమేరకు ఇరు రాష్ట్రాల అధికారులు నిర్ణయాన్ని ప్రకటించారు. పరస్పర సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవాలని తీర్మానించారు. స్కానింగ్ కేంద్రాల్లో లింగనిర్ధారణ జరుగకుండా తీసుకోవాల్సిన ప్రణాళికలను రూపొందించుకున్నారు. శ్రీకాకుళం జిల్లాలో వజ్రపుకొత్తూరు, పాతపట్నం, మెళియాపుట్టి, పలాస తదితర మండలాల్లో స్త్రీల కంటే పురుషులు అధికంగా ఉన్నారన్నారు. స్కానింగ్ చేసేటప్పుడు లింగ నిర్ధారణ చేయకుండా ఆడశిశువుల పుట్టుకలు తగ్గకుండా చూడాలని ఇరు జిల్లాల అధికారులు నిర్ణయించారు. అలాగే విస్తృతంగా పీసీపీఎన్‌డీటీ చట్టపై అవగాహన కార్యక్రమాలు జరిపించాలని తీర్మానించుకున్నారు. రెండు రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న ప్రాంతాల్లోని స్కానింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘా చేపట్టి, ఆకస్మిక తనిఖీలు చేయడంతోపాటు చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. సరిహద్దు ప్రాంతాల్లో ఆరోగ్య విద్య, బాలికల ప్రాధాన్యత, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు బాలికల సంక్షేమానికి చేపడుతున్న చర్యలను తెలియజేసేలా అవగాహన సదస్సులను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సమావేశంలో సీడీఎంపీహెచ్ (ఒడిశా) డాక్టర్ ప్రదీప్ కుమార్ పాత్రో, డీఎంవో ప్రదీప్ కుమార్ పాండా, పీసీపీఎన్‌డీటీ కోఆర్డినేటర్ జగదీశ్ పట్నాయక్, శ్రీకాకుళం జిల్లా నుంచి డిప్యూటీ డీఎంహెచ్‌వో అనూరాధ, డెమో పైడి వెంకటరమణ, డిప్యూటీ డెమో వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

శిశు ఆరోగ్యానికి అండగా ఎస్‌ఎన్‌సీయూ



తల్లీబిడ్డను ఎస్‌ఎన్‌సీయూ నుంచి డిశ్చార్జ్ చేస్తున్న వైద్యబృందం

సీతంపేట: స్థానిక ప్రాంతీయ ఆస్పత్రిలోని ఎస్‌ఎన్‌సీయూ (స్పెషల్ న్యూ బోర్న్ కేర్ యూనిట్) శిశు ఆరోగ్యానికి అండగా నిలుస్తోంది. తక్కువ బరువు, వివిధ ఆరోగ్య సమస్యలతో జన్మించిన శిశువులకు ప్రాణం పోస్తోంది. ఆమదాలవలస మండలం పొన్నానపేట గ్రామానికి చెందిన గర్భిణి గొద్దు మాధవి 32 వారాలకే సుఖప్రసవంలో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. కేవలం 1.5 కిలోల బరువు మాత్రమే ఉండి అనారోగ్య స్థితికి శిశువు చేరుకుంది. వెంటనే సీతంపేట ఎస్‌ఎన్‌సీయూ యూనిట్‌లో గత నెల 24న చేర్పించారు. 26 రోజుల పాటు వైద్యులు ప్రత్యేక వైద్యసేవలు అందజేశారు. కేఎంసీ, వార్మర్ కేర్, విటమిన్ డి–3, మల్టీ విటమిన్ డ్రాప్స్, ఫొటోగ్రఫీ వంటివి చేయడంతో శిశువు 2.5 కిలోల బరువు పెరిగి ఆరోగ్యకరంగా ఉండడంతో ఎస్‌ఎన్‌సీయూ నుంచి బుధవారం డిశ్చార్జ్ చేశారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు, వైద్యులు వెంకటరావు, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుల మృతి

• కారు డ్రైవర్ పరారీ..
• పోలీస్ స్టేషన్‌ను ముట్టడించిన గ్రామస్తులు



లోయలో పడిన కారు



హేమంత్ మినియాక(ఫైల్)

రాయగడ: పట్టణానికి 3కిలోమీటర్ల సమీపంలోని రఫ్‌కోన కూడలిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోయారు. మృతులు కుటలి గ్రామానికి చెందిన హేమంత్ మినియాక(29), కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్ సమితి పరిధిలోని పిపలపదర్ గ్రామానికి చెందిన ఆనంద మండంగి(21)గా పోలీసులు గుర్తించారు. ఈ మేరకు ఘటనా స్థలానికి చేరుకొని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే... ఆనంద, హేమంత్ బుధవారం ఉదయం కొరాపుట్ నుంచి బైక్‌పై రాయగడకు బయలుదేరారు. ఎదురుగా వస్తున్న కారు వారిని ఢీకొట్టింది. దీంతో రెండు వాహనాలు సమీపంలోని లోయలో పడిపోయారు. యువకులిద్దరూ ఘటనా స్థలం వద్దే మృతిచెందగా.. కారు డ్రైవర్ పరారయ్యాడు. హేమంత్ రఫ్‌కోన గ్రామంలో జనసేవా కేంద్రాన్ని నిర్వహిస్తుండగా, ఆనంద్ రాయగడ ఆటానమస్ కళాశాలలో ప్లస్–3 కామర్స్ విభాగంలో తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇద్దరి ప్రాణాలు తీసిన కారు డ్రైవర్ పరారవ్వడంతో అతనిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ బాధిత కుటుంబీకులతో పాటు రఫ్‌కోన, పిపల్‌పదర్ గ్రామస్తులు సదర్ పోలీస్ స్టేషన్ ముట్టడించారు. బాధిత కుటుంబాలకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. స్పందించిన పోలీసులు.. నిందితుడిని పట్టుకొని, తగిన న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమనిగింది.



ఆనంద మండంగి(ఫైల్)



పోలీస్ స్టేషన్‌ను ముట్టడించిన గ్రామస్తులు

జోలాపుట్‌లో పోలీస్ అవుట్ పోస్ట్ భవనం

• ప్రారంభించిన దక్షిణాంచల్ డీఐజీ చరణ్‌సింగ్



అవుట్ పోస్టను ప్రారంభిస్తున్న డీఐజీ చరణ్‌సింగ్ మినా



జోలాపుట్‌లో పర్యటిస్తున్న డీఐజీ, పక్కన ఎస్పీ

కొరాపుట్: జిల్లాలోని జోలాపుట్‌లో పోలీస్ అవుట్ పోస్ట్ భవనాన్ని సదరన్ వెస్ట్రన్ రేంజ్ డీఐజీ చరణ్ సింగ్ మినా బుధవారం ప్రారంభించారు. నందపూర్ సమితి మాచ్‌ఖండ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఈ ప్రాంతం ఆంధ్రా–ఒడిశా సరిహద్దులో మావోయిస్టుల ప్రభావిత ప్రాంతంగా ఉంది. 1977లో రేకుల షెడ్డులో ఔట్‌పోస్టును ఏర్పాటు చేయగా, అప్పటి నుంచి సిబ్బంది వివిధ సమస్యలతో సతమతం అయ్యేవారు. ఈ నేపథ్యంలో మావోయిస్టు ప్రాంతాల్లో పోలీసు వ్యవస్థను ఆధునీకరించే ప్రక్రియలో భాగంగా ఈ నూతన భవనాన్ని నిర్మించారు. డీఐజీ పర్యటన నేపథ్యంలోపటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కొరాపుట్ జిల్లా ఎస్పీ అభినవ్ శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి సర్వం సిద్ధం

• నేటి నుంచి ఆగస్టు 2 వరకు ర్యాలీ
• పోలీసు శిక్షణ కళాశాల మైదానంలో ఏర్పాట్లు



రిక్రూట్‌మెంట్ ర్యాలీ ఏర్పాట్లపై ఆర్మీఅధికారులతో సమీక్షిస్తున్న విజయనగరం కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం క్రైమ్: అగ్నిపథ్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహణకు ఆర్మీ అధికారులతో కలిసి జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. గురువారం నుంచి ప్రారంభం కానున్న ఈ ర్యాలీ ఆగస్టు రెండో తేదీవరకూ నిర్వహించనున్నారు. శ్రీకాకుళం జిల్లా నుంచి ఎన్‌టీఆర్ జిల్లా వరకూ సుమారు 8,600 మంది అభ్యర్థులు 14 రోజుల పాటు విజయనగరంలోని పోలీసు శిక్షణ కళాశాల మైదానంలో నిర్వహించనున్న ఈ ర్యాలీకి హాజరుకానున్నారు. ఇప్పటికే రాతపరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు పరుగుపందెం, లాంగ్ జంప్, ఇతర శారీరక దారుఢ్య, వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం ఆర్మీ అధికారులు తుది ఎంపిక చేస్తారని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం జేసీ మయూర్ అశోక్, ఆర్మీ రిక్రూటింగ్ అధికారి జీఎస్.రణ్‌ధావా, వినయ్ కుమార్‌లతో కలిసి ర్యాలీ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను ఆమె పర్యవేక్షించారు. పరుగుపందెం, నిర్వహణకు మైదానంలో చేసిన ఏర్పాట్లు, బారికేడ్లు, విద్యుత్ దీపాలు, తాత్కాలిక మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాల ఏర్పాటు ,ఎంపికల నేపథ్యంలో అస్వస్థతకు గురైన అభ్యర్థులకు అత్యవసర వైద్యసదుపాయం, బస్టాండ్, రైల్వేస్టేషన్ నుంచి వచ్చే అభ్యర్థులకు రవాణా ఏర్పాట్లు, వర్షాలు కురిసినట్లయితే పరుగుపందెం నిర్వహణకు ప్రత్యామ్నాయ ప్రదేశాల గుర్తింపు తదితర అంశాలపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు.

అభ్యర్థులకు సదుపాయాలు

అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి వచ్చే అభ్యర్థులకు రిక్రూట్‌మెంట్ జరిగే ప్రదేశానికి చేరుకునే విధంగా ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేశామని తెలిపారు. వేదిక వద్దకు చేరుకున్న వెంటనే అభ్యర్థుల ప్రవేశపత్రాలను పరిశీలించి అనంతరం లోపలికి అనుమతిస్తారని, అభ్యర్థులకు 1.6 కిలోమీటర్ల పరుగు పందెం నిర్వహిస్తారని తెలిపారు. ఆర్మీ ప్రమాణాల ప్రకారం ఈ పరుగుపందెంలో ఎంపికైన వారికి లాంగ్ జంప్, మరికొన్ని శారీరక దారుఢ్య పరీక్షలు, ఆరోగ్య తనిఖీలు ఉంటాయని చెప్పారు. అనంతరం విద్యార్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉంటుందన్నారు. ఆర్మీ ర్యాలీలో పాల్గొనే అభ్యర్థులకు అల్పాహారం, భోజన వసతి సమకూరుస్తున్నామ న్నారు. ఈ ప్రాంత అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్మీకి అధిక సంఖ్యలో ఎంపికవుతారని ఆకాంక్షిస్తున్నామని చెప్పారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ ఆర్.శ్రీరాములనాయుడు, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ కల్యాణ్ చక్రవర్తి, సెట్విజ్ సీఈఓ రాంగోపాల్, ఆర్అండ్‌బీ ఈఈ వెంకటరమణ, డీఈ శ్రీనివాస్, ఈపీడీసీఎల్ అధికారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లా బాస్కెట్ బాల్ ఎంపికలు



ఎంపికైన క్రీడాకారులతో బాస్కెట్‌బాల్ సంఘ ప్రతినిధులు, కోచ్‌లు, సీనియర్ ప్లేయర్స్

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా అండర్–13 బాస్కెట్ బాల్ ఎంపిక పోటీలు ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగాయి. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానం వేదికగా జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ఈ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు హాజరై ప్రతిభ నిరూపించుకున్నారు. జిల్లా అండర్–13 బాలుర బాస్కెట్‌బాల్ జట్టును ఖరారు చేశారు. 12 మంది తుది జాబితా, మరో ఇద్దరు స్టాండ్‌బైతో కూడిన 14 మంది జాబితాను కృష్ణమూర్తి వెల్లడించారు. ఇక్కడ ఎంపికైన జిల్లా బాలుర జట్టును ఈ నెల 21 నుంచి 23 వరకు తూర్పు గోదావరి జిల్లా రామచంద్రాపురం వేదికగా జరగనున్న 8వ ఏపీ రాష్ట్ర అండర్–13 బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్–2023 పోటీలకు పంపించనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో కోచ్, సంఘ కార్యనిర్వాహక కార్యదర్శి జి.అర్జున్‌రావురెడ్డి, బీ.వీ.ఎస్.ఎన్.రాజు, బాబ్జి పాల్గొన్నారు.

జిల్లా బాలురు జట్టు:

సతివాడ శ్రీహర్ష, గులాబి దేవ, కొమరం పవన్, మెట్ట ప్రణీత్, పట్టాన కిషోర్‌కుమార్, ఉప్పాడ ప్రభాస్, కరగాణ పార్థసాయి, బర్డాన చైతన్య, బిడ్డిక ప్రదీప్‌కుమార్, చింతాడ చార్లెస్, పుక్కళ్ల తారకేశ్వరరావు, సూరాడ జ్ఞానేశ్వరరావు. స్టాండ్‌బైగా మంత్రి లోకేష్ నాయుడు, గోనాన అఖిల్ ఎంపికైన వారిలో ఉన్నారు.

గంజాం జిల్లాకు భూ సంస్కరణ పురస్కారం



రాష్ట్రపతి ముర్ము నుంచి పురస్కారం అందుకుంటున్న జిల్లా అధికారులు



పురస్కార కార్యక్రమంలో ఏడీఎంలు, తహసీల్దార్

బరంపురం: గంజాం జిల్లా చేపట్టిన భూ సంస్కరణ కార్యక్రమంలో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. ఈ నేపథ్యంలో దేశ రాజధాని ఢిల్లీలోని విజ్ఞాన భవన్‌లో కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి పురస్కారాల పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా హాజరై, పురస్కారాలను అందజేశారు. జిల్లాకు చెందిన డిప్యూటీ కలెక్టర్ దయాసిత పరిడా, ఏడీఎం ప్రియరంజన్ పృష్టి, కుకుడాఖండి బ్లాక్‌కు చెందిన తహసీల్దార్ సంఘమిత్ర దేవి పాల్గొని, పురస్కారాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా సీఎం నవీన్ పట్నాయక్ వారికి అభినందనలు తెలియజేశారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చనలు



కుంకుమార్చనలో పాల్గొన్న తెలుగు మహిళలు



పూజలు చేయిస్తున్న ఉమమహేశ్వర శర్మ

బరంపురం: నగరంలోని మార్తపేట వీధిలో గత 2రోజులుగా ఘనంగా జరుగుతున్న రామలింగ చౌడేశ్వరి అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా బుధవారం సామూహిక శ్రీచక్ర కుంకుమార్చనలు నిర్వహించారు. సిద్దేశ్వర స్వామి కల్యాణ మండప ప్రాంగణంలో ఛౌడేశ్వరి మహిళా కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు చేపట్టారు. నేతేటి ఉమమహేశ్వర శర్మ సమక్షంలో దాదాపు 200కి పైగా తెలుగు మహిళలు సంప్రదాయ అంకరణలో పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే అమ్మవారికి సుప్రభాత సేవ, దేవతార్చన, బాలభోగం, హోమం , మహాభోగం, సాయంత్రం సంధ్యాకాలార్చన, మంగళహారతి, వేదస్వస్తి, తీర్థప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో పూజా కమిటీ ప్రతినిధులు, సిద్దేశ్వర స్వామి కల్యాణ మండపం చైర్మన్ టి.గోపి తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు అండగా ఎస్‌డీసీ



సమావేశమైన కొరాపుట్ ఎస్‌డీసీ కౌన్సిల్

కొరాపుట్: ప్రత్యేక అభివృద్ధి మండలి(ఎస్‌డీసీ) ద్వారా గిరిజనులకు అండగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని కొరాపుట్ జిల్లా ఎస్‌డీసీ చైర్మన్ చంద్రశేఖర్ మాఝి ప్రకటించారు. జిల్లా కేంద్రం లోని సద్భావనా స్వగృహ భవనంలో ఎస్‌డీసీ 3వ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమితి సమావేశాలకు సభ్యులను తప్పనిసరిగా ఆహ్వానించాలని ఆదేశించారు. అంతరాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో మహనీయుల విగ్రహాలు నెలకొల్పనున్నట్లు తెలిపారు. క్రీడల్లో గిరిజన యువతను ప్రోత్సహించేందుకు ప్రత్యేక ఆర్థికసాయం అందిస్తామన్నారు. యువతకు ఉపాధి, వృత్తి శిక్షణ అందిస్తామని వివరించారు. సమావేశంలో గిరిజన విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు సిక్కోలు ఎక్స్‌లెన్స్ అవార్డులు

• దానేటి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక చేయూత
• ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ దానేటి శ్రీధర్ వెల్లడి



మాట్లాడుతున్న డాక్టర్ దానేటి శ్రీధర్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లాలో విద్యావ్యాప్తికి, ప్రతిభగల పేద విద్యార్థులకు దానేటి చారిటబుల్ ట్రస్టు ద్వారా సిక్కోలు ఎక్స్‌లెన్స్ అవార్డుల పేరిట ఆర్థిక చేయూత అందిస్తామని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ దానేటి శ్రీధర్ తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని మెడికవర్ ఆసుపత్రిలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 10వ తరగతి తత్సమాన పరీక్ష, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, మెడికల్, చార్టెడ్ అకౌంటెంట్స్ తదితర పరీక్షలకు చదువుతున్నవారు ప్రతిభావంతులై ఉండి ఆర్థిక ఇబ్బందులు ఉంటే ప్రోత్సహించడానికి ట్రస్ట్ సిద్ధంగా ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని ఉన్నత చదువులు చదివి జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. రూ.20 లక్షల రివార్డింగ్ ఫండ్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. అర్హత కలిగిన విద్యార్థులను గుర్తించేందుకు విశ్రాంత ప్రొఫెసర్ గుంట తులసీరావు, జామి భీమశంకర్, సుగుణాకర్, జయరాంలతో పాటు వివిధ కళాశాల ప్రిన్సిపాళ్లతో కూడిన తొమ్మిది మంది కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కమిటీని ప్రతిభ గల నిరుపేద విద్యార్థులు సంప్రదించాలని కోరారు.

21న మోటివేషనల్ ప్రోగ్రాం..

ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు మహ్మద్ రఫీ ఇటీవల జిల్లాకు చెందిన ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులతో జయహో పేరిట ఈ నెల 21న మోటివేషనల్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్టు డాక్టర్ దానేటి శ్రీధర్ తెలిపారు. పాతబస్టాండ్ సమీపంలోని మారుతీ థియేటర్ ఎదురుగా ఖాళీ స్థలంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరుకావాలని కోరారు. సమావేశంలో విద్యావేత్త జామి భీమశంకర్, సుగుణాకర్, సన్ డిగ్రీ కళాశాల అధినేత జయరాం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి తయారు చేసిన ప్రాజెక్టుపై ఆర్జేడీ ఆరా



పాతపట్నం: అభినవ్‌తో మాట్లాడుతున్న ఆర్జేడీ జ్యోతికుమారి

పాతపట్నం: రొంపివలస గ్రామానికి చెందిన విద్యార్థి రేగేటి అభినవ్ కొత్త జిల్లాలు, రాజధానులు అనే అంశంపై ప్రాజెక్టు రూపొందించాడు. ఈ విషయాన్ని విద్యాశాఖాధికారుల నుంచి తెలుసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్‌లు ఫోన్లో అభినవ్‌తో మాట్లాడి అభినందించారు. ప్రాజెక్టు గురించి పూర్తి వివరాలు తెలుసుకోవాలని ఆర్జేడీ జ్యోతికుమారిని ఆదేశించారు. దీంతో రొంపివలసలోని అభినవ్ ఇంటికి బుధవారం వెళ్లి ప్రాజెక్టుపై ఆమె ఆరా తీశారు. గ్రామంలోని విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడారు. అనంతరం సీఆర్, రొంపివలసలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో ఆమె మాట్లాడారు. ఎంఈవో శ్రీధర్, ప్రధానోపాధ్యాయులు కుమారస్వామి, రామమూర్తిలు, తిరుపతిరావు, మధుసూదనరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చాగంటి తులసికి పురస్కారం




విజయనగరం టౌన్: రచయిత్రి చాగంటి తులసికి బలివాడ కాంతారావు స్మారక జీవిత సాఫల్య సాహిత్య పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్టు భారత నిధి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డి.ఎ స్.పి.గోపీకృష్ణ, నిర్వాహకులు మేడా మస్తాన్ రెడ్డి, అడపా రామకృష్ణలు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22న శనివారం ఉదయం 10 గంటలకు పాల్‌నగర్‌లో ఉన్న ఆమె ఇంటి వద్ద పురస్కారం అందజేస్తామన్నారు. సాహితీవేత్తలు, అభిమానులు వేడుకకు తరలిరావాలని పిలుపునిచ్చారు.

థియేటర్ అసిస్టెంట్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫోర్ట్: వైద్య విధాన్ పరిషత్ ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న థియేటర్ అసిస్టెంట్స్ -2 పోస్టులు, ఆడియోమెట్రిసిన్ పోస్టులు-2కు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయ అధికారి (డీసీహెచ్ఎస్) డాక్టర్ బి.గౌరీశంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 20 నుంచి 30వ తేదీ లోగా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలోని డీసీహెచ్ఎస్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

నేడు తోటపల్లి నీరు విడుదల

- ప్రాజెక్టులో పుష్కలంగా నీరు



తోటపల్లి ప్రాజెక్టు

వీరఘట్టం: ఖరీఫ్ పంటల సాగుకు తోటపల్లి ప్రాజెక్టు నీటిని గురువారం విడుదల చేయనున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌తో పాటు పాలకొండ, కురుపాం, రాజాం ఎమ్మెల్యేలు విశ్వాసరాయి కళావతి, పాముల పుష్పశ్రీవాణి, కంబాల జోగులు భాగస్వాములు కానున్నారు. జలాశయంలో పుష్కలంగా నీరు ఉందని, పార్వతీపురం మన్యంతో పాటు, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని 64వేల ఎకరాల పాత ఆయకట్టుకు సమృద్ధిగా సాగునీరు సరఫరా చేస్తామని నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. తొలుత శివారు ఆయకట్టుకు సాగునీరందించే ప్రధాన చెరువులకు తోటపల్లి నీటిని మళ్లించనున్నారు.

వైఎస్సార్ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం: వైఎస్సార్ జీవిత సాఫల్య, వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ట్విజ్ సీఈఓ బి.రామ్‌గోపాల్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళలు, సామాజిక సేవలు, కార్యక్రమాలు, ప్రజా వ్యవహారాలు, సైన్స్ అండ్ ఇంజినీరింగ్, వాణిజ్యం, పరిశ్రమలు, ఔషధాలు, సాహిత్యం, విద్య, పౌరసేవ, క్రీడలు వంటి రంగాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో విశిష్ట ప్రతిభ కనబరిచిన వారికి వైఎస్సార్ పురస్కారాలు ప్రదానం చేస్తారన్నారు. గ్రామ/మురికివాడల అభివృద్ధికి కృషిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలు, లాభాపేక్షలేని సంస్థలకు సంబంధించిన వ్యక్తులు వ్యక్తిగతంగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తిగల వారు ఆగస్టు 5వ తేదీలోగా సెట్విజ్ కార్యాలయంలో సంబంధిత వివరాలను జతచేసిన దరఖాస్తులను అందజేయాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్: 98499 13090 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఇ-స్టాంప్ కౌంటర్ ప్రారంభం

విజయనగరం రూరల్: జిల్లా కేంద్రంలోని దాసన్నపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇ-స్టాంప్ కౌంటర్‌ను స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ జిల్లా రిజిస్ట్రార్ ఎ.వి.కుమారి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటివరకు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అన్ని లావాదేవీలు స్టాంప్ పేపర్లపైనే జరిగేవని తెలిపారు. టాంపరింగ్‌కు ఆస్కారం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ఇ-స్టాంపింగ్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఇ-స్టాంప్‌ల అమ్మకాలను ఏజెన్సీలకు అప్పగించినట్టు వెల్లడించారు. జిల్లాలోని 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇ-స్టాంప్ విక్రయ కౌంటర్లను ఏర్పాటుచేశామని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ సబ్‌రిజిస్ట్రార్లు కె.నిరంజన్‌కుమార్, కె.ఎ.షేలా, సీనియర్ అసిస్టెంట్ సీముసురు బంగారాజు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు

విజయనగరం క్రైమ్: ఐటీ యాక్ట్ కింద కేసు నమోదుచేసినట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు బుధవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. స్థానిక పావని నగర్‌లో నివాసం ఉంటున్న రాయవరపు శిరీషానాయుడు కలెక్టరేట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇన్‌స్టాగామ్‌లో పరిచయమైన వ్యక్తి గిఫ్ట్‌లు పంపిస్తానని నమ్మబలికి కస్టమ్ డిపార యూజర్ చార్జీలు కట్టాలని చెప్పడంతో దఫదఫాలుగా నగదు బదిలీ చేశారు. అలాగే ఇండియన్ కరెన్సీని యుఎస్ డాలర్స్‌కింద మారుస్తానని నమ్మబలకడంతో నగదు బదిలీ చేశారు. చివరికి తాను మోసపోయినట్లు గుర్తించి వన్‌టౌన్ పోలీసులను ఆమె బుధవారం ఆశ్రయించారు. ఇప్పటివరకూ రూ. 68 లక్షల 46వేలకు పైగా నగదు బదిలీ జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సీఐ వెంకటరావు ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బిందువా.. అందుమా..!



ముత్యాల్లా మెరుస్తూ..



చెట్ల కొమ్మల నడుమ..



ఎండలతో మండిపోయిన నేలను చల్లబరిచేందుకు అంబరం నుంచి జాలువారిన నీటి బిందువు కనువిందు చేసింది. బిందువు నేలను తాకే క్రమంలో చూపరుల మదిని దోచి ఆనంద డోలికల్లో తేలియాడేలా చేసింది. విజయనగరం జిల్లాలో నాలుగురోజులుగా కురుస్తున్న వర్షాలకు పూలమొక్కలపై జాలువారిన నీటి బిందువులు కనువిందు చేసిన దృశ్యాలు.

– డి.సత్యనారాయణమూర్తి, సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



విజయనగరంలోని వసతిగృహంలో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

- దోమలపై ముప్పేట దాడి
- హైరిస్క్ ప్రాంతాలపై దృష్టి
- దోమలు వృద్ధిచెందే ప్రాంతాల గుర్తింపు
- నిర్మూలనకు ఏసీఎం మందు పిచికారీ
- ఇప్పటికే మొదటి రౌండ్ పూర్తి
- వసతి గృహాల్లోనూ సాగుతున్న స్ప్రేయింగ్

విజయనగరం ఫోర్ట్:

జిల్లాలో అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. వ్యాధులు ముసురుకునే వేళ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్యారోగ్యశాఖ అప్రమత్తమైంది. సీజనల్ వ్యాధులకు ప్రధాన కారణమైన దోమల నిర్మూలనకు చర్యలు చేపట్టింది. దోమలు వృద్ధిచెందే ప్రాంతాలను గుర్తించి ఏసీఎం మందును పిచికారీ చేయిస్తోంది. ఇప్పటికే మొదటిరౌండ్‌ను పూర్తిచేసింది.

ప్రజల్లో చైతన్యం

వ్యాధుల వ్యాప్తి, నివారణ చర్యలతో పాటు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై వైద్యారోగ్య యంత్రాంగం ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తోంది. దోమలు వృద్ధి చెందే అవకాశాలను, నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తోంది. పూల కుండీలు, టైర్లు, తాగి పడేసిన కొబ్బరి బొండాలు, ఫ్రిజ్ ట్రేలు వంటి వాటిల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని హితబోధ చేస్తోంది. తాగునీటి వనరులు కలుషితం కాకుండా చూసుకోవాలని సూచిస్తోంది.

జిల్లాలో 17 హైరిస్క్ ప్రాంతాల గుర్తింపు

జిల్లాలో 17 హైరిస్క్ ప్రాంతాలను వైద్య ఆరోగ్యశాఖ అధికారులు గుర్తించారు. రామభద్రపురం, ఆరికతోట, పిరిడి, మెంటాడ, కొట్టాం, వేపాడ, బొద్దాం, కొత్తవలస, దేవుపల్లి పీహెచ్‌సీల పరిధిలో 17 ప్రాంతాలను హైరిస్క్ ప్రాంతాలుగా గుర్తించారు. ఈ ప్రాంతాల్లో దోమల నివారణకు ఏసీఎం (ఆల్ఫా సైఫర్ మైత్రిన్) మందును పిచికారీ చేయిస్తున్నారు. మొదటి రౌండ్‌ను జూన్ ఒకటో తేదీ నుంచి 15వ తేదీ నాటికి పూర్తిచేశారు. రెండో విడత ఆగస్టు ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు చేపట్టనున్నారు. కాలువల్లో దోమలు వృద్ధి చెందకుండా టెమిఫాస్ మందును పిచికారీ చేస్తున్నారు. 1000 మందిలో రెండు కంటే ఎక్కువ మలేరియా కేసులు నమోదైన ప్రాంతాన్ని హైరిస్క్‌గా గుర్తించి దోమల నివారణతోపాటు వైద్యసేవలు అందిస్తున్నారు.



విజయనగరం రైల్వేస్టేషన్ ప్రాంతంలో ఇంట్లోని ఫ్రిజ్‌లో నీటిని పరిశీలిస్తున్న మలేరియా శాఖ సిబ్బంది



బొబ్బిలిలో మురుగు కాలువలో దోమల నివారణ మందు పిచికారి ఇలా..

38 చోట్ల దోమల లార్వా గుర్తింపు..

విజయనగరంలోని రైల్వేస్టేషన్ ప్రాంతంలో 125 ఇళ్లను వైద్య సిబ్బంది పరిశీలించారు. నీటి కుండీలు, పూల కుండీలు, ఫ్రిజ్‌లు వంటివి 178 ప్రదేశాలను తనిఖీచేశారు. ఇందులో డెంగీని కలుగజేసే దోమల లార్వా ఉన్నట్టు గుర్తించి వాటిని తొలగించారు.

వసతి గృహాల్లోనూ...

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా వసతి గృహాల్లో దోమల నివారణ చర్యలను యుద్ధ ప్రాతిపదికన వైద్యాధికారులు చేపడుతున్నారు. దోమల నివారణ మందును పిచికారీ చేస్తున్నారు. ఇప్పటివరకు జిల్లాలోని 76 వసతి గృహాల్లో స్ప్రేయింగ్‌ను పూర్తిచేశారు.

3,51,132 ఇళ్లలో ఫీవర్ సర్వే

జిల్లాలో 6,38,113 ఇళ్లు ఉన్నాయి. ఇందులో 3,51,132 ఇళ్లకు వెళ్లి వైద్య సిబ్బంది ఫీవర్ సర్వే పూర్తిచేశారు. 392 మంది జ్వరపీడితులను గుర్తించారు. వీరిలో 205 మందికి రక్త నమూనాలు తీసి మలేరియా నిర్ధారణ పరీక్షలు చేయగా ఏ ఒక్కరికి వ్యాధి నిర్ధారణ కాలేదు.

దోమల వృద్ధికి చెక్

> జిల్లాలో మలేరియా, డెంగీ కారక దోమల వృద్ధిని కట్టడి చేసేందుకు చర్యలు చేపట్టాం. దోమల నిర్మూలనకు ఏసీఎం మందును పిచికారీ చేయిస్తున్నాం. పారిశుద్ధ్యం నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించాం. ఇప్పటికే ఏసీఎం ద్రావణం పిచికారీ మొదటిరౌండ్ పూర్తయింది. రెండో రౌండ్ ఆగస్టు ఒకటో తేదీ నుంచి చేయనున్నాం. వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరిస్తున్నాం.
>
> – డాక్టర్ ఎస్.భాస్కరరావు, డీఎంహెచ్ఓ

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

- జిల్లా సీనియర్ సివిల్ జడ్జి కె.నాగమణి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి నాగమణి

విజయనగరం రూరల్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, ఆడపిల్లలకు ఉన్నత విద్య, ఉపాధి, అనంతరమే వివాహం కోసం ఆలోచించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.నాగమణి సూచించారు. మండలంలోని ద్వారపూడి గ్రామ సచివాలయంలో బుధవారం నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఆడపిల్లల సంరక్షణపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు బాధ్యతగా మెలగాలన్నారు. బాలికలు, మహిళలను లైంగికంగా వేధించేవారికి 5 నుంచి 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించడం జరుగుతుందన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ లోక్ అదాలత్‌లతో కేసులను పరిష్కరించడంతో పాటు సివిల్, క్రిమినల్ కేసులను పేదల తరఫున వాదించేందుకు న్యాయవాదులను ఏర్పాటుచేస్తుందన్నారు. టెలీలా లీగల్ ఎయిడ్ కౌన్సిల్ న్యాయవాది పీవీ వరలక్ష్మి మాట్లాడుతూ టెలీలా యాప్ ద్వారా బాధితులు న్యాయ సహాయానికి ఆన్‌లైన్‌లోనే ఫిర్యాదులు అందజేయవచ్చని, న్యాయసలహాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో విజయనగరం సీఎస్‌డీటీ వీవీఆర్ జగన్నాథరావు, విజయనగరం రూరల్ ఏఎస్ఐ లక్ష్మీరాజ్యం, న్యాయవాది తాడిరాజు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి సర్వం సిద్ధం



రిక్రూట్‌మెంట్ ర్యాలీ ఏర్పాట్లపై ఆర్మీ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

- నేటి నుంచి ఆగస్టు 2 వరకు ర్యాలీ
- పోలీసు శిక్షణ కళాశాల మైదానంలో ఏర్పాట్లు

విజయనగరం క్రైమ్: అగ్నిపథ్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహణకు ఆర్మీ అధికారులతో కలిసి జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. గురువారం నుంచి ప్రారంభం కానున్న ఈ ర్యాలీ ఆగస్టు రెండో తేదీవరకూ నిర్వహించనున్నారు. శ్రీకాకుళం జిల్లా నుంచి ఎన్‌టీఆర్ జిల్లా వరకూ సుమారు 8,600 మంది అభ్యర్థులు 14 రోజుల పాటు విజయనగరంలోని పోలీసు శిక్షణ కళాశాల మైదానంలో నిర్వహించనున్న ఈ ర్యాలీకి హాజరు కానున్నారు. ఇప్పటికే రాతపరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు పరుగుపందెం, లాంగ్ జంప్, ఇతర శారీరక దారుఢ్య, వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం ఆర్మీ అధికారులు తుది ఎంపిక చేస్తారని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం జేసీ మయూర్ అశోక్, ఆర్మీ రిక్రూటింగ్ అధికారి జీఎస్.రణ్‌ధావా, వినయ్ కుమార్‌లతో కలిసి ర్యాలీ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను ఆమె పర్యవేక్షించారు. పరుగు పందెం, నిర్వహణకు మైదానంలో చేసిన ఏర్పాట్లు, బారికేడ్లు, విద్యుత్ దీపాలు, తాత్కాలిక మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాల ఏర్పాటు ,ఎంపికల నేపథ్యంలో అస్వస్థతకు గురైన అభ్యర్థులకు అత్యవసర వైద్యసదుపాయం, బస్టాండ్, రైల్వేస్టేషన్ నుంచి వచ్చే అభ్యర్థులకు రవాణా ఏర్పాట్లు, వర్షాలు కురిసినట్లయితే పరుగుపందెం నిర్వహణకు ప్రత్యామ్నాయ ప్రదేశాల గుర్తింపు తదితర అంశాలపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు.

అభ్యర్థులకు సదుపాయాలు

అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి వచ్చే అభ్యర్థులకు రిక్రూట్‌మెంట్ జరిగే ప్రదేశానికి చేరుకునే విధంగా ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేశామని తెలిపారు. వేదిక వద్దకు చేరుకున్న వెంటనే అభ్యర్థుల ప్రవేశపత్రాలను పరిశీలించి అనంతరం లోపలికి అనుమతిస్తారని, అభ్యర్థులకు 1.6 కిలోమీటర్ల పరుగుపందెం నిర్వహిస్తారని తెలిపారు. ఆర్మీ ప్రమాణాల ప్రకారం ఈ పరుగుపందెంలో ఎంపికైన వారికి లాంగ్ జంప్, మరికొన్ని శారీరక దారుఢ్య పరీక్షలు, ఆరోగ్య తనిఖీలు ఉంటాయని చెప్పారు. అనంతరం విద్యార్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉంటుందన్నారు. ఆర్మీ ర్యాలీలో పాల్గొనే అభ్యర్థులకు అల్పాహారం, భోజన వసతి సమకూరుస్తున్నామన్నారు. ఈ ప్రాంత అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్మీకి అధిక సంఖ్యలో ఎంపికవుతారని ఆకాంక్షిస్తున్నామని చెప్పారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ ఆర్.శ్రీరాములనాయుడు, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ కల్యాణ్ చక్రవర్తి, సెట్విజ్ సీఈఓ రాంగోపాల్, ఆర్అండ్‌బీ ఈఈ వెంకటరమణ, డీఈ శ్రీనివాస్, ఈపీడీసీఎల్ అధికారులు పాల్గొన్నారు.

శిశుఆరోగ్యానికి అండగా ఎస్ఎన్‌సీయూ



తల్లీబిడ్డను ఎస్ఎన్‌సీయూ నుంచి డిశ్చార్జ్ చేస్తున్న వైద్యబృందం

సీతంపేట: స్థానిక ప్రాంతీయ ఆస్పత్రిలోని ఎస్ఎన్‌సీయూ (స్పెషల్ న్యూ బోర్న్ కేర్ యూనిట్) శిశు ఆరోగ్యానికి అండగా నిలుస్తోంది. తక్కువ బరువు, వివిధ ఆరోగ్య సమస్యలతో జన్మించిన శిశువులకు ప్రాణం పోస్తోంది. శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలం పొన్నానపేట గ్రామానికి చెందిన గర్భిణి గొడ్డు మాధవి 32 వారాలకే సుఖప్రసవంలో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. కేవలం 1.5 కిలోల బరువు మాత్రమే ఉండి అనారోగ్య స్థితికి శిశువు చేరుకుంది. వెంటనే సీతంపేట ఎస్ఎన్‌సీయూ యూనిట్‌లో గత నెల 24న చేర్పించారు. 26 రోజుల పాటు వైద్యులు ప్రత్యేక వైద్యసేవలు అందజేశారు. కేఎంసీ, వార్మర్ కేర్, విటమిన్‌డి-3, మల్టీ విటమిన్ డ్రాప్స్, ఫొటోగ్రఫీ వంటివి చేయడంతో శిశువు 2.5 కిలోల బరువు పెరిగి ఆరోగ్యకరంగా ఉండడంతో ఎస్ఎన్‌సీయూ నుంచి బుధవారం డిశ్చార్జ్ చేశారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు, వైద్యులు వెంకటరావు, మనోజ్ పాల్గొన్నారు.

డిప్లమో విద్యార్థి ఆత్మహత్య



సందీప్ (ఫైల్)

విజయనగరం క్రైమ్: పరీక్షల్లో ఫెయిల్ అవడంతో తల్లిదండ్రులు ఏమైనా అంటారన్న భయంతో ఓ డిప్లమో విద్యార్థి బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విజయనగరంలోని వైఎస్సార్‌నగర్‌లో జరిగిన ఈ సంఘటనపై టూటౌన్ సీఐ విజయానంద్ బుధవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వైఎస్సార్ నగర్‌కు చెందిన ఇమంది సందీప్ (19) గజపతినగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిప్లమా చదువుతున్నాడు. 15 రోజుల క్రితం వెలువడిన థర్డ్ ఇయర్ డిప్లమో ఫలితాల్లో ఫెయిలయ్యాడు. ఆ విషయాన్ని తల్లిదండ్రులకు తెలియకుండా గోప్యంగా ఉంచాడు. అయితే ఫలితాలు విడుదలైనట్లు తల్లిదండ్రులకు తెలియడంతో తనను ఏమైనా అంటారేమోనన్న భయంతో ఈ నెల 17న రాత్రి 8 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి, కనబడకుండా పోయాడు. అనంతరం ఫలితాల్లో ఫెయిలైనందున తల్లిదండ్రులు ఏమైనా అంటారేమోనన్న భయంతో తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు తన మిత్రుడి మొబైల్‌కు మెసెజ్ పంపించాడు. దీంతో మిత్రుడు ఆ సమాచారాన్ని వెంటనే సందీప్ తల్లిదండ్రులకు తెలియపరిచాడు. ఈ నేపథ్యంలో కుటుంబసభ్యులు సందీప్ ఆచూకీ కోసం ఎంత వెతికినా తెలియరాలేదు. దీంతో టూటౌన్ పోలీసులకు 18న ఫిర్యాదు చేశారు. టూటౌన్ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టడంతో బుధవారం వైఎస్సార్ నగర్ సమీపంలో ఓ నేలబావిలో సందీప్ మృతదేహం లభ్యమైంది. మృతుని తండ్రి సూర్యప్రకాశరావు జూట్‌మిల్లులో లేబర్‌గా పనిచేస్తున్నాడు. హెడ్ కానిస్టేబుల్ పి.రమణ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురుగు మందు తాగి యువకుడు..

మెంటాడ: మండలంలోని కైలాం గ్రామానికి చెందిన గండి మురళి (27) పురుగు మందు తాగి బుధవారం ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆంధ్ర ఎస్సై సిద్ధార్థ తెలిపారు. మృతుడి తల్లిదండ్రుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

గడ్డిమందు తాగి మరో యువకుడు..



కోడూరు గణేష్ (ఫైల్)

గజపతినగరం రూరల్: మండలంలోని కొత్తబగ్గాం గ్రామానికి చెందిన కోడూరు గణేష్ (25) గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. అప్పుల బాధ తాళలేక గణేష్ మంగళవారం రాత్రి పురుగు మందు తాగడాన్ని గమనించిన కుటుంబసభ్యులు జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించడంతో చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుడి తల్లి కోడూరు సన్యాసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గజపతినగరం హెచ్‌సీ శ్రీనువాసనాయుడు తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు చిన్నారులు ఉన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి



మృతి చెందిన రమణ

గంట్యాడ: మండలంలోని పెద మజ్జి పాలెం గ్రామానికి చెందిన ఆరుగురు ఆటోపై రాయిగడ వెళ్తుండగా రామవరం వద్ద టిప్పర్ లారీ ఢీకొట్టడంతో గాయపడిన ఆటో డ్రైవర్ సైలాడ రమణ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్ కుమార్ నాయుడు తెలిపారు.

లక్ష్యాలు చేరని వారిపై చర్యలు తప్పవు

- గడపగడపకు మనప్రభుత్వం పనుల బిల్లులను వెంటనే అప్‌లోడ్ చేయాలి
- కలెక్టర్ నాగలక్ష్మి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలైన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ నిర్మాణాలు వచ్చే నెల 15 నాటికి పూర్తిచేయాలని, లక్ష్యాలు చేరుకోని వారిపై చర్యలు తప్పవని కలెక్టర్ నాగలక్ష్మి ఇంజినీరింగ్ అధికారులను హెచ్చరించారు. సెప్టెంబర్ 30 నుంచి కొత్తభవనాల్లో ఉద్యోగుల విధులు కొనసాగాలన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో ఎంపీడీఓలు, డీఈఓలు, ఏఈలతో ప్రియారిటీ భవనాల పురోగతిపై మండల వారీగా భవన నిర్మాణాలపై బుధవారం సమీక్షించారు. ప్రస్తుతం బిల్లులన్నీ పెండింగ్ లేకుండా చెల్లించామని, గడువులోగా పనులు పూర్తిచేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే పూర్తిచేసిన భవనాలను వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బిల్లులను అప్‌లోడ్ చేయడంలో ఆలస్యం చేస్తే సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. వారానికి ఒకసారి పూర్తి నివేదిక, ఖర్చు చేసిన నిధుల వివరాలను సమర్పించాలని పంచాయతీరాజ్ ఎస్ఈ గుప్తాను ఆదేశించారు. ఖరీఫ్ పనులు ప్రారంభమైన వేళ రైతులకు ఇబ్బంది లేకుండా విత్తనాలు, ఎరువులు అందించాలని సూచించారు.

- నాన్‌ప్రియారిటీ పనులకు సంబంధించి ఒక్కో మండలానికి ఉపాధి హామీ నిధులలో రూ.60 లక్షల వరకు ఖర్చు చేసే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని, ఈ పనులకు రెండు రోజుల్లో ప్రతిపాదనలను పంపించాలని ఎంపీడీఓలకు కలెక్టర్ సూచించారు. ఈ నిధులతో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ రాజ్‌కుమార్, సీపీఓ బాలాజీ, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రాజా, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఉమాశంకర్, జీఎస్‌డబ్ల్యూ అధికారి నిర్మలాదేవి, తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న జిల్లా అధికారులు

21 నుంచి ఇంటింటి సర్వే

విజయనగరం అర్బన్: కచ్చితమైన ఓటర్ల జాబితాను రూపొందించేందుకు రాజకీయ పార్టీలు తమవంతు సహకారం అందించాలని కలెక్టర్ నాగలక్ష్మి కోరారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా ఈ నెల 21 నుంచి ఇంటింటి సర్వే ప్రారంభమవుతుందని చెప్పారు. నెలరోజుల పాటు జరిగే సర్వేలో భాగంగా బూత్ స్థాయి అధికారులు ప్రతీ ఇంటికీ వెళ్లి, ఓటర్లు వివరాలను తనిఖీ చేస్తారని చెప్పారు. కొత్త ఓటర్ల నమోదు, లేని ఓటర్ల పేర్లు తొలగించడంతో పాటు, అడ్రస్, డోర్ నంబర్ తదితర వివరాలను ఓటర్ల జాబితాలతో సరిచేస్తారని చెప్పారు. దీని కోసం రాజకీయ పార్టీలు తమ బూత్ ఏజెంట్ల జాబితాలను ముందే అందజేయాలని కోరారు. బీఎల్ఓతోపాటు, పార్టీల ఏజెంట్లు ఇంటింటికీ వెళ్లి వివరాలను సేకరించడం వల్ల సమగ్ర జాబితాలు రూపొందుతాయన్నారు. అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ ఓటుహక్కు కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు. కొత్త ఓటర్ల నమోదుకు కళాశాలల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని తెలిపారు. వలస కార్మికులు, ట్రాన్స్‌జెండర్లు, ఇళ్లులేని, స్థిర నివాసం లేని వారి వివరాలను కూడా సేకరించి ఓటుహక్కు కల్పించేదుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో వివిధ పార్టీల నాయకులు రొంగలి పోతన్న, టి.హరనాథ్, సుధీర్, ఐవీపీ రాజు, రమేష్, సతీష్, కోటేశ్వరరావు, సోములు, జేసీ కె.మయూర్ అశోక్, డీఆర్వో ఎం.గణపతిరావు, ఈఆర్ఓలు, ఎలక్షన్ సెల్ అధికారులు, ఎన్నికల డీటీలు పాల్గొన్నారు.